క్లుప్తంగా

అక్రమ మద్యం పట్టివేత

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. గుండిమెడకు చెందిన నూతక్కి గోపి నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్నాడని సమాచారంతో వడ్డేశ్వరం వద్ద తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో 15 క్వార్టర్ బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మేడికొండూరు సీఐగా జయకుమార్



మేడికొండూరు: మేడికొండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దార్ల జయకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పల్నాడ జిల్లా కారెంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ కె.వాసు గుంటూరు సైబర్ క్రైమ్‌కు బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ జయకుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

పెనుమాకలో జగనన్న ఆరోగ్య సురక్ష



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని బుధవారం పెనుమాక 2వ సచివాలయం పరిధిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి పరీక్షలు నిర్వహించామని, అనంతరం మెగా మెడికల్ క్యాంపులో వారు తెలిపిన ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని వచ్చిన వారందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 350 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ విజయేంద్ర, ఎఎన్ఎమ్‌లు పి.గీత, కె. ఝాన్సీరాణి, ఆశ వర్కర్లు పి.జయప్రభ, నాగమణి, మార్తమ్మ, హెచ్‌వీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ర్యాంప్‌ల ఏర్పాటు



ఫిరంగిపురం: మండలంలోని మూడు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లలో ర్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పద్మనాభుడు బుధవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లో ఓటింగ్ వేసేందుకు వికలాంగులు ఉపయోగించే వీల్ చైర్లు వినియోగించుకునేందుకు వీలుగా ర్యాంప్‌లు ఉన్నాయని చెప్పారు. కాగా గుండాలపాడు(237)బూత్, గరుడాచలపాలెం(229) బూత్, తక్కెళ్లపాడులో 210, 219 బూత్‌లలో ర్యాంప్‌లు లేకపోవడంతో సంబంధిత విద్యాశాఖ ఎంఈఓలకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. దీంతో ర్యాంప్‌లు ఏర్పాటు చేయడంతో వాటిని పరిశీలించామని చెప్పారు. ఓటర్లు వినియోగించుకునేందుకు వీలుగా టాయిలెట్లు లేని 113 తాళ్లూరు కమ్యూనిటీ హాలు, కండ్రిక ఆర్‌సీఎం పాఠశాలలో నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు వివరించారు. త్వరిత గతిన వాటిని నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుల ర్యాలీని జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్: దేశంలోని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక చర్యలను నిరసిస్తూ రైతుల సంక్షేమం కోసం నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగిస్తోందని, వ్యవసాయ పారిశ్రామిక రవాణా, ఖనిజ సకల సంపదలను అంబానీ, ఆదానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని అన్నారు. విధానాలను నిరసిస్తూ జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా ట్రాక్టర్లు, బైక్ ర్యాలీ నిర్వహించాలని కిసాన్ సంయుక్త మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిందని చెప్పారు. అందులో భాగంగా ప్రాతూరు క్రాస్ రోడ్ నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్కే ఎర్రపీరు, టి.బక్కిరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మళ్లీ జగనన్నే

- జీసీ బిడ్డ గంజి చిరంజీవిని ఎమ్మెల్యేగా చేద్దాం
- మంగళగిరిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం
- ప్రతిపక్షాల అధికార దాహం ప్రజలకు తెలుసు
- అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్లలాంటివి
- ఆ దిశగానే మన పయనం
- మంచి జరిగింది కాబట్టే ఓటు అడిగే హక్కు ఉంది
- ఆత్మీయ సమావేశంలో పార్టీ నాయకులు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గంజి చిరంజీవి, వేదిక ఎమ్మెల్సీ హనుమంతరావు, వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: అందరి నోట ఒకటే మాట.. జగనన్న మరలా ముఖ్యమంత్రిని చేసుకుందాం, బీసీ బిడ్డ గంజి చిరంజీవిని ఎమ్మెల్యేగా గెలిపిద్దామని మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. మంగళగిరి రూరల్ పార్టీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మంగళగిరి పట్టణ పరిధిలోని ఈద్గాలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి సెంట్రల్ ఆఫీస్ నుంచి పర్యవేక్షకులు శ్రీనివాసరావు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ మంగళగిరి రూరల్ అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి(ఎంఎస్ఆర్) హాజరయ్యారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంగళగిరి రూరల్‌లో ఉన్న వివిధ ప్రాంతాల్లో కార్యకర్తల సమస్యలతో పాటు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై చర్చ, జరగవలసిన అభివృద్ధిపై చర్చ నిర్వహించారు. అనంతరం పలువురు ముఖ్య నాయకులు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అడ్డా అని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామని, మన బీసీ బిడ్డ అయిన గంజి చిరంజీవిని ఎమ్మెల్యేగా గెలిపిస్తామని స్పష్టం చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పటికీ నాలుగు శాఖల మంత్రిగా పనిచేసినా మంగళగిరి నియోజకవర్గ ప్రజల కష్టాలు, అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం మంగళగిరి ప్రజల కష్టాలు నేనే తీరుస్తానంటూ ప్రగల్భాలు పలుకుతూ ప్రజల్ని మోసగించే ప్రయత్నాలు చేస్తూ పలు హామీలతో నారా లోకేష్ మన ముందుకు వస్తున్నాడని, మనం అడగాల్సింది ఒక్కటే.. అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడ ఉన్నారు? ఎందుకు పట్టించుకోలేదు అని పేర్కొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి..

మంగళగిరి నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో 20 ఏళ్ల జరిగిన అభివృద్ధి ఈ ఐదు సంవత్సరాల్లోనే జరిగిందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 75 శాతం ఉన్నారని, అందుకే సిట్టింగ్ ఎమ్మెల్యే కాకుండా బీసీ వర్గానికి చెందిన గంజి చిరంజీవిని సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని వివరించారు. ఆయన్ను మనందరం సమష్టిగా కృషి చేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

మంగళగిరిని లోకేశ్ పట్టించుకోలేదు..

మంగళగిరి నియోజకవర్గంలో పలు సమస్యలను నారా లోకేష్ దృష్టికి పట్టించుకోలేదని సమన్వయకర్త గంజి చిరంజీవి ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత కల్పించి పరిపాలనలో భాగస్వామ్యం చేశారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పదవులను ఇచ్చి వారిని గౌరవించారని, నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలపై చూపిస్తున్న ప్రేమ అనురాగాలు, సంక్షేమ పథకాలే మనల్ని గెలిపిస్తాయని వివరించారు. మన నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కు మనకి ఉంది.. లోకేష్ ఏం చేశారని ఓటు అడుగుతారని ఆయన ప్రశ్నించారు. మంగళగిరి ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీకే పట్టం కట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, పచ్చల శ్యామ్, ఆదామ్, బెజ్జం రాజాజీ, యస్‌సి కమిషన్ మెంబర్ కట్టిపోగు బసవరాజు, దొంత వెంకటరావు పాల్గొన్నారు.

విద్య నేర్చుకోవడానికి విరామం లేదు

- స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ క్రాంతి
- కేఎల్‌యూలో ఘనంగా అంతర్జాతీయ ఎడ్యుకేషన్ డే



మాట్లాడుతున్న క్రాంతి

తాడేపల్లిరూరల్: విద్య నేర్చుకోవడానికి విరామం లేదని ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.క్రాంతి అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ డే వేడుక బుధవారం నిర్వహించారు. క్రాంతి మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని, ప్రతి నిత్యం టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో నేర్చుకోవడానికి విరామం అనేది ఉండకూడదని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సలహాదారులు, జేఎన్‌టీయూ(కాకినాడ) ఆచార్యులు డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యావకాశాలు, పథకాలను గురించి విద్యార్థులకు వివరించారు. పెరుజియా యూనివర్శిటీ ప్రతినిధి ప్రొఫెసర్ ఓస్వాల్డో గెర్వాసి అంతర్జాతీయ విద్య పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అకడమిక్ స్టాఫ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.గోవర్ధిని, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే రామకృష్ణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ పాల్గొన్నారు.

నవరత్నాల ద్వారా ప్రతి ఒక్కరికి లబ్ధి

- మళ్లీ జగనన్నను సీఎంని చేయాలి
- పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి



ఆత్మకూరులో వృద్ధురాలికి నమస్కరిస్తున్న గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమని, నవరత్నాల ద్వారా ప్రతి ఒక్క పేదవాడికి లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఆత్మకూరులో మూడో రోజు 'గుడ్‌మార్నింగ్ మన మంగళగిరి' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గంజి చిరంజీవి ఇంటింటికి వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటూ వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. అందులో మనందరం భాగస్వామ్యం కావాలని కోరారు. మంగళగిరి నుంచి విజయాన్ని మొదలు పెట్టాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరులో గత మూడు రోజుల్లో దాదాపుగా 800 నివాసాల్లో గడపగడప కార్యక్రమం నిర్వహించాము. 98 శాతం మంది ప్రజలు ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరిందని చెప్పినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్ము శివరామిరెడ్డి, సాంబిరెడ్డి, జాలాది నాగేశ్వరరావు, మాన్యం నాగేశ్వరరావు, మంగళగిరి పట్టణ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, తోటా శ్రీనివాసరావు, గుంజి రాజ్యలక్ష్మి, రంగిశెట్టి పెద్దబ్బాయి, సింగంశెట్టి విజయ్, వ్యాసం అజయ్, ఆదాం, బేతపూడి నరసయ్య పాల్గొన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ మేకతోటి దయాసాగర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ దయాసాగర్



క్రీడాకారులలో ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి, వేమారెడ్డి తదితరులు

తాడికొండ: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. స్థానిక సత్యసాయి హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను బుధవారం నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం క్రీడాకారులతో కలసి వాలీబాల్ ఆడి ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా దయాసాగర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీలు విజయవంతంగా గ్రామ, మండల స్థాయిని దాటి నియోజకవర్గ స్థాయికి చేరుకున్నాయని చెప్పారు. యువత స్నేహపూర్వక వాతావరణంలో పోటీతత్వంతో తలపడి విజయాలు సాధించాలని కోరారు. గత ప్రభుత్వాల హయాంలో క్రీడాలకు తగిన ప్రాధాన్యం లేని కారణంగా సరైన వసతులు లేక ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు మరుగున పడిపోయారన్నారు. కానీ నేడు అందుకు భిన్నంగా ప్రభుత్వం యువతలోని నైపుణ్యాలను వెలికితీసి మెరుగైన క్రీడారత్నాలను సమాజానికి అందించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల ద్వారా ఇప్పటికే మెరికల్లాంటి క్రీడాకారులు ఎందరో వెలుగులోకి వచ్చినట్లు వెల్లడించారు. నేటి ఆధునిక జీవన విధానంలో విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్పారు. అవకాశాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, నిడుముక్కల సర్పంచి ఎం.రత్నకుమారి, ఉప సర్పంచ్ వి.వెంకటరెడ్డి, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డెప్యూటీ డైరెక్టర్ డి.సుధాకర్, ఎంపీడీఓ అత్తోట దీప్తి, వైఎస్సార్ సీపీ నాయకులు టి.నరసింహారావు, జి.సాంబిరెడ్డి, బి.సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పేద క్రీడాకారులకు వరం..

తాడేపల్లిరూరల్: ఆడుదాం ఆంధ్రా పేద క్రీడాకారులకు వరం అని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. యర్రబాలెం డాన్‌బాస్కో స్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, కార్పొరేషన్ సెక్రటరి శ్రీనివాసరావులతో కలసి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద క్రీడాకారులు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్రా ఇది అందరి ఆట ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి గుండా మధు, గుండా శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, షేక్ మాలిక్, షేక్ సనిముల్లా, షేక్ గౌస్ పాల్గొన్నారు.

కమిటీ నిర్ణయం మేరకే టీడీఆర్ బాండ్లు మంజూరు

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రభుత్వ నిర్దేశిత మార్గదర్శకాలు, ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయాల ప్రకారం టీడీఆర్ బాండ్ల మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్(టీడీఆర్) బాండ్ల జారీ పరిశీలన కమిటీ మెంబర్స్‌తో బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీడీఆర్ బాండ్ల పంపిణీ పారదర్శకంగా జరిగేలా నగరపాలక సంస్థ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అది నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బాండ్లు పంపిణీకి పట్టణ ప్రణాళిక విభాగం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో పెద్ద పలకలూరు రోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు, ఏటీ అగ్రహారం రోడ్డు, తారకరామానగర్, మొండి గేటు, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తరణ, పైప్ లైన్ పనులు జరిగిన చోట టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉందన్నారు. త్వరలో కమిటీ నిర్ణయం మేరకు జారీ చేస్తామని కమిషనర్ వెల్లడించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ మహాపాత్రో, ఏసీపీ అజయ్ కుమార్, మురళి పాల్గొన్నారు.

వీవీఐటీలో భవిష్యత్ భవన నిర్మాణంపై సదస్సు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్‌కు చెందిన నిర్మాణద్రష్ట విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ భవన నిర్మాణం, రూపకల్పన బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆస్ట్రేలియాకు చెందిన ఏసీఈబీఐఎం సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ సుధీర్‌నాథ్ బుడ్డీ హాజరయ్యారు. భవన నిర్మాణ సమయంలో వ్యర్థాలను తగ్గించి నాణ్యత, సామర్థ్యాల పెరుగుదలకు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీమ్) సాంకేతికత దోహదపడుతుందని వివరించారు.దీని ద్వారా నిర్మాణ సమయంలో కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చని, డిజైన్ దశలో విద్యుత్, నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్. కుమారస్వామి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ టి. శ్రీధర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంతో స్థిరమైన ఆదాయం

ఫిరంగిపురం: పండ్లతోటల పెంపకంతో రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని ఉపాధి హామీ ఏపీఓ జయకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏపీఓ జయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగులో భాగంగా సన్నకారు రైతులకు పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తోటలు గురించి దానివల్ల కలిగే ఉపయోగాలు గురించి రైతులకు వివరించాలని కోరారు. ఇప్పటికే పండ్లతోటల పెంపకం కింద ఫిరంగిపురం, నుదురుపాడు, 113తాళ్లూరు, గొల్లపాలెం, మేరికపూడి, బేతపూడి, వేమవరం, మునగపాడు,హౌస్ గణేష్ గ్రామాల్లో 44 ఎకరాల్లో వివిధ రకాల పండ్లతోటలు పెంచుతున్నారని చెప్పారు. మామిడి, నిమ్మ,, జామ, ఆరంజ్, సపోటా, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్ , రేగి పంటలు అధికంగా ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి రైతులకు మూడేళ్లకు సరిపడా వాటికి అవసరమయ్యే ఖర్చులు అందజేస్తారని చెప్పారు.

వాలీబాల్ విజేత 'డోకిపర్రు'

తాడికొండ: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ ఫైనల్స్ పురుషుల విభాగంలో నియోజకవర్గ స్థాయిలో మేడికొండూరు మండలానికి చెందిన డోకిపర్రు సచివాలయం పరిధిలోని అంబేడ్కర్ టీం విజయం సాధించింది. స్థానిక సత్యసాయి బాబా హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న పోటీల్లో తొలుత మేడికొండూరు మండలం, తుళ్లూరు మండలానికి చెందిన టీమ్‌లకు పోటీలు నిర్వహించారు. మేడికొండూరు మండల పరిధిలోని డోకిపర్రు సచివాలయం నుంచి అంబేడ్కర్ యూత్ టీం ఘనవిజయం సాధించింది. తదుపరి ఫైనల్స్‌లో మేడికొండూరు మండలానికి చెందిన టీమ్, తాడికొండ మండల టీమ్ తో హోరాహోరీగా తల పడగా మేడికొండూరు మండల డోకిపర్రు సచివాలయ పరిధిలోని అంబేడ్కర్ టీం 2-1 సెట్ల తేడాతో విజయం సాధించింది. విజయం సాధించిన టీంకి 29న జరిగే వేడుకలలో 35 వేల రూపాయల ప్రథమ బహుమతిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేయనున్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



దుగ్గిరాల జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిర



తాడికొండలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



మంగళగిరి మున్సిపల్ హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి అధ్యక్షత వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సి.ఇందిర మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని, మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి జానమ్మ, హెల్త్ కేటర్ వి.సుబ్బారావు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ వి.బుజ్జి పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో..

నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులు పి.బుజ్జిబాబు అధ్యక్షత వహించారు. అనంతరం మహానగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.వి.గుప్త, సెక్రటరి కె.ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రోగామ్ చైర్మన్ కాకుమాను జోజప్పల ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థినులకు పరీక్ష అట్టలు, పెన్నులు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుందరరాజు, కె.రామచంద్రారెడ్డి, కేవీ శ్రీరామచంద్రారెడ్డి, డి.వి. రమణమ్మ, కె.పద్మావతి, ఉమాదేవి, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

బాలికా విద్యతో అన్ని రంగాలలో ముందంజ

తాడికొండ: బాలికా విద్యతోనే సమాజంలో అన్ని రంగాలలో మహిళలు ముందంజలో నడుస్తారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ కె.కృష్ణ కుమారి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దివంగత ఇందిరా గాంధీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజుని 2008 నుంచి జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. మంచి పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం అమ్మ ఒడి, విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం విద్య, వసతి దీవెన, నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, వంటి పథకాలు అందుబాటులోకి తెచ్చారన్నారు. వీటితో పాటు మహిళల రక్షణ కోసం దిశ, నిర్భయ చట్టాలు, బేటీ బచావో, భేటి పడావో వంటి చట్టాలు అమల్లోకి తీసుకొచ్చి బాల్య వివాహాల నిషేదంతో పాటు మహిళల హక్కుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెరికల దేవరాజు, అంగన్‌వాడీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరి మున్సిపల్ స్కూల్‌లో..

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి హాజరై కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడబిడ్డల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. తల్లికి తన బిడ్డలను చదివించుకోవడానికి ఎటువంటి కష్టంలేకుండా అమ్మ ఒడి ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించారని, గతంలో ఆడపిల్లలు పాఠశాలలో టాయ్‌లెట్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో బాలికల కోసం ప్రత్యేకంగా టాయ్‌లెట్లు నిర్మించారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, దామర్ల నరసింహారావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



నెహ్రూనగర్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కాజా టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించని 110 మంది ద్విచక్ర వాహనదారులపై, రిఫ్లెక్టివ్ టేపులు లేని 15 వాహనాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వాహనదారులంతా తప్పనిసరిగా రహదారి భద్రతతో పాటు నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో ఆర్టీవో అధికారులు గోపాల్, సౌజన్య, రాఘవరావు, విజయసారథి పాల్గొన్నారు.

రేపు టీజేపీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను ఈనెల 26న ఉదయం 10:30 గంటలకు కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి జ్ఞానదేవ్, చక్కా అధిపతి రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులంతా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి వడ్లమాని రవి పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 92464 88133, 92464 89003 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.